www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 8 జూన్ 2025
5
వైఎస్ఆర్





కడప బిల్టప్ వద్దనున్న ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పెద్దదర్గా పీఠాధిపతి ఆరిపుల్లా హుసేని, వి.ఎస్.అమీర్ బాబు, ముస్లిమ్ సోదరులు

పెన్నా నదిలో ఈతకెళ్లి
తండ్రీకొడుకులు మృతి

- జమ్మలమడుగులో విషాదం



పెన్నానది వద్ద గుమిగూడిన జనం



నీటమునిగి మృతిచెందిన తండ్రీకొడుకులు మనోహర్, జోయల్

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగులో పట్టణంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి చెల్లెలిని చూడటానికి వచ్చి తిరిగిరాని లోకాలకు వెళ్లారు. ముద్దనూరు రోడ్డులోని పెన్నా నదిలో ఈతకు వెళ్లి శనివారం తండ్రీ గంగుల మనోహర్ (40), కుమారుడు గంగుల జోయల్ (16) మృతి చెందారు. స్థానికుల వివరాల మేరకు... నదిలో ఈతకు తండ్రీకొడుకులు పెన్నానదిలోకి దిగారు. నీటిలో కొట్టుకుపోయి గల్లంతయ్యారు. జమ్మలమడుగు పట్టణ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. గజ ఈతగాళ్ల సహాయంతో మొదట కుమారుడు జోయల్‌ను, తర్వాత తండ్రి మనోహర్ మృతదేహాలను బయటకు తీశారు. మృతుల కుటుంబ సభ్యుల రోధనలతో అక్కడున్న వారి మనసు కలసి వేసింది. మనోహర్ హైదరాబాద్‌లో బంజారాహిల్స్ హిల్స్‌లో నివాసం ఉన్నట్లు, అతను అక్కడ ఒక ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కర్నూలులో జిల్లాలో పెళ్లి చూసుకొని జమ్మలమడుగులోని బిసి కాలనీలో ఉన్న చెల్లెలును చూడటానికి మనోహర్ కుటుంబంతో సహా వచ్చారు. అనంతరం కుటుంబంతో గండికోటకు వెళ్లి తిరిగి వస్తుండగా పెన్నా బ్రిడ్జి వద్ద తండ్రీకొడుకులు ఈతకు వెళ్లి మృత్యువాత పడ్డారు. చెల్లెలు అన్న మృతదేహం వద్ద ఒకసారి లే అన్న అంటూ ఒకవైపు, మరోవైపు భార్య భర్తను, కొడుకును కోల్పోయి ఇద్దరిని పట్టుకొని ఏడుస్తుంటే అందరిని కట్టతడి పెట్టించింది. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాలను తరలించారు. పోలీసులు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అట్టహాసంగా ప్రమాణ స్వీకారోత్సవం

- డిసిసిబి చైర్మన్‌గా సూర్యనారాయణరెడ్డి
- డిసిఎంఎస్ చైర్మన్‌గా జయప్రకాష్
- హాజరైన మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు



ప్రమాణం చేస్తున్న సూర్యనారాయణరెడ్డి, మాట్లాడుతున్న జయప్రకాష్

ప్రజాశక్తి-కడప అర్బన్

తెలుగుదేశం పార్టీ ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో భాగంగా ఉమ్మడి కడప జిల్లాకు చెందిన బద్వేల్, రైల్వేకోడూరుకు చెందిన నాయకులకు డిసిసిబి, డిసిఎంఎస్ చైర్మన్ పదవులు దక్కాయి. శనివారం నగరంలోని మాధవి కన్వెషన్‌లో డిసిసిబి చైర్మన్‌గా మంచూరు సూర్యనారాయణరెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్‌గా యర్రగండ్ల జయప్రకాష్ ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఆయనతోపాటు రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, టిడిపి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు చమర్తి జగనమోహన్‌రాజు విచ్చేశారు. ఈ సందర్భంగా టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కష్టపడి పనిచేసేవారికి, సీనియారిటీ ఆధారంగా జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పదవులు ఇస్తారని తెలిపారు. పార్టీలోకి వచ్చిన వెంటనే పదవులు ఇవ్వరన్నాని స్పష్టం చేశారు. కష్టపడిని వారికి గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. చైర్మన్ పదవులు బద్వేల్, రైల్వే కోడూరు నియోజకవర్గాలకు చెందిన నాయకులకు ఇచ్చారని చెప్పారు. పదవులు పొందిన వారు ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావద్దని కోరారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారని, సూపర్ సిక్స్ అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం పొందిన చైర్మన్ పదవులు రైతులకు సంబంధించినవని చెప్పారు. రైతులకు కావాల్సిన రుణాలు మంజురు చేయాలని కోరారు. తక్కువ వడ్డీరేటుతో రుణాలు ఇవ్వాలని పేర్కొన్నారు. చైర్మన్లకు కావాల్సిన సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. కడప ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ కార్యకర్తల సేవలను గుర్తించి పదవులు ఇచ్చారని చెప్పారు. కడప నియోజకవర్గంలో కార్యకర్తలు బాగాపని చేసి పదవులు పొందాలని పిలుపునిచ్చారు. ప్రజలకు సేవ చేయాలని పేర్కొన్నారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ రైతులను వెన్నుండి నడపాలని కోరారు. మామిడి రైతుల సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ టిడిపి కోసం నిరంతరం పని చేశారని చెప్పారు. డిసిసి, డిసిఎంఎస్ ఆస్తులను కాపాడాలని పేర్కొన్నారు. తక్కువ ధరలకే ఎరువులు అమ్మాలని కోరారు. చైర్మన్‌లు సూర్యనారాయణరెడ్డి, జయప్రకాష్ మాట్లాడుతూ పదవులు ఇచ్చిన చంద్రబాబు, లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక నాయకులు విజయమ్మ, రితేష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ధన్యవాదాలు తెలిపారు. రైతులకు తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేస్తామని చెప్పారు. సకాలంలో రుణాలు, ఎరువులు, విత్తనాలు, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు వెళతామని పేర్కొన్నారు. డిసిసి బ్యాంక్ అభివృద్ధే తమ ధ్యేయమని చెప్పారు. డిసిసి, బిసిఎంఎస్‌లను అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు.బద్వేల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ రితేష్‌రెడ్డి మాట్లాడుతూ వీరారెడ్డిపై నమ్మకం ఉంచి తమతో నడుస్తున్నారని చెప్పారు. మెట్టరైతులను ఆదుకోవాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో రైతులకు తెలియకుండానే రుణాలు తీసుకున్నారని తెలిపారు. వీరిని రికవరీ చేసి తీరుతామని బద్వేల్ సొసైటీల విచారణ పూర్తయిందని చెప్పారు. ఐదేళ్లల్లో రైతులు బాగా నష్టపోయారన్నారు. డిసిసి బ్యాంక్ రుణాలు అందించడంలో కడప బ్యాంక్ వెనుకబడి ఉందని పేర్కొన్నారు. బ్రహ్మం సాగర్ నీటితో బద్వేల్‌లో చెరువులను నింపాలని కోరారు. సభలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, మాజీ ఎమ్మెల్సీ బి.టెక్ రవి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, జమ్మలమడుగు ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి, ముక్కా రూపానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

- మాట తప్పిన టిడిపి
- పాలన ఏడాది పూర్తయినా అమలుకాని సూపర్‌సిక్స్
- సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్



స్టిక్కర్లు ఆవిష్కరిస్తున్నసిపిఎం నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

స్మార్ట్ మీటర్లు వ్యతిరేకించాలని, విద్యుత్ ఛార్జీలు పెంచమని చెప్పిన మాట టిడిపి తప్పిందని, సూపర్ సిక్స్ హామీలు తొలి ఏడాది పూర్తయినా అమలు చేయలేదని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ విమర్శించారు. శనివారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి, సూపర్ సిక్స్ హామీలను అమలు చేయండి స్టిక్కర్లను సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.రామ్మోహన్, వి.అన్వేష్ సంయుక్తంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ 2024 ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే వైసిపి ప్రవేశపెట్టిన స్మార్ట్ మీటర్లను తొలగిస్తామని, విద్యుత్ ఛార్జీలు పెంచబోమని నొక్కి వక్కానించారని గుర్తు చేశారు. విస్తృతమైన సంక్షేమ పథకాల అజెండాను ఎన్నికల ముందు ప్రకటించడంతో ప్రజలు నమ్మి రాష్ట్ర అసెంబ్లీలో టిడిపి, ఎన్‌డిఎ కూటమికి 164 సీట్లతో సంపూర్ణ మెజారిటీ ఇచ్చారన్నారు. వైసిపికి ప్రతిపక్ష హోదా కూడా లేకుండా ప్రజలు చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన టిడిపి, ఎన్‌డిఎ కూటమి 2024, జూన్ 4 నాటికి ఏడాది పూర్తి అయినా ఎన్నికల ముందు ఇచ్చిన 'సూపర్ సిక్స్ హామీల్లో' ఏ ఒక్కటీ పూర్తిగా అమలు చేయలేదన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టమని చెప్పి, విస్తృతంగా ఏర్పాటు చేస్తున్నారని, విద్యుత్ ఛార్జీలు పెంచమని నమ్మ పలికి నేడు మోయలేని భారాలు ప్రజలపై వేస్తున్నారని వాపోయారు. అన్నదాత సుఖీభవ పథకం, డిజిటల్ లక్ష్మి పథకం, నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు పథకాలన్నీ కూడా అట్టకెక్కించారన్నారు. 30 సంవత్సరాలు దాటిననానిధులు లేమితో పూర్తిగాని గాలేరు-నగరి, హంద్రీ-నీవా ప్రాజెక్టులు పూర్తి చేయకుండానే, రాష్ట్ర రైతాంగాన్ని ఆశల సౌదంలో ముంచడానికి పోలవరం - బనకచర్ల అనుసంధానంతో కరువు సీమ అయినా రాయలసీమకు గోదావరి నీళ్లు తరలిస్తానని భ్రమలు గురి చేస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి : యుటిఎఫ్



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పోరాటానికి పిలుపునిచ్చినప్పుడు ఎస్‌జిటిలకు మ్యానువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీని తుంగలో తొక్కి వెబ్ కౌన్సిలింగ్ పేరుతో ఉపాధ్యాయులను వేధింపులకు గురి చేయడం తగదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు అన్నారు. శనివారం యుటిఎఫ్ భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌జిటి ఉపాధ్యాయులకు వెబ్ కౌన్సెలింగ్ కాకుండా మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు నిర్వహించాలని తెలిపారు. ఉపాధ్యాయ బదిలీల విషయంలో రాష్ట్ర విద్యా శాఖకు ఏ ఒక్క విషయంలోనూ స్పష్టత లేదని ఉపాధ్యాయ సంఘాలతో చర్చించిన విధంగా కాకుండా ఇష్టం వచ్చిన రీతిలో బదిలీలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ప్రిఫరెన్షియల్ కేటగిరి సంబంధించి వికలాంగులు, వితంతువులు, విడాకులు పొందిన టీచర్ల పట్ల దుర్మార్గపు విధానాలు తెచ్చి మానసిక క్షోభకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. బదిలీల విషయంలో ప్రభుత్వం తీసుకునే ప్రతీ నిర్ణయం వివాదాస్పదంగా ఉందని, అవగాహన రాహిత్యంతో ఉపాధ్యాయులను వేధింపులకు గురి చేయడమే లక్ష్యంగా, గత ప్రభుత్వ విధానాలను అనుసరిస్తూ ముందుకు వెళుతున్నట్లుగా ఉందని చెప్పారు. స్కూల్ అసిస్టెంట్ టీచర్లను ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా బదిలీ చేయడం, ఇంగ్లీష్, గణితం ఉపాధ్యాయులను కాంప్లెక్స్ ఉపాధ్యాయుల పేరుతో అభద్రతకు గురి చేయడం, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఎటువంటి ఉద్యోన్నతులు కల్పించకపోవడం లాంటి అసంబద్ధ నిర్ణయాలు ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు.చట్టంలో లేని, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించని విషయాలను కనీస సమాచారం తెలియజేయకుండానే ఇష్టానుసారంగా గంట గంటకు కొత్త మార్గదర్శకాలను జారీ చేస్తూ గజిబిజి గందరగోళంగా బదిలీల ప్రక్రియను ప్రహసనంగా మార్చి వేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ అసంబద్ధ బదిలీలను ఆపి ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి హామీ ఇచ్చిన మేరకు ఎస్‌జిటి ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించి తీరాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆదివారం డిఇఒ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున ఉపాధ్యాయులతో కలిసి నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా సహాధ్యక్షురాలు సుజాత రాణి, జిల్లా కార్యదర్శి ఏజాస్ అహమ్మద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణారెడ్డి, రూతు ఆరోగ్యమేరి, జిల్లా కార్యవర్గ సభ్యులు గోపీనాథ్,చంద్రశేఖర్, శంకర్ రెడ్డి, దేవదత్తం, శివప్రసాద్ పాల్గొన్నారు.

టిడిపికి 'సుగవాసి' రాజీనామా



ప్రజాశక్తి-రాయచోటి/రాజంపేట అర్బన్

జిల్లా తెలుగుదేశం పార్టీలో పెనుపరిణామాలు చోటు చేసుకున్నాయి. రాజంపేట మాజీ ఎంపీ, రాయచోటి మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు తనయుడు సుగవాసి బాలసుబ్రమణ్యం శనివారం తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేస్తూ లేఖను అధినేత చంద్రబాబుకు పంపించారు. ప్రజలు, పాలకొండ్రాయుడు అభిమానుల సలహాలు, సూచనలు, అభిప్రాయాల మేరకు వారి మనోభావాలను గౌరవిస్తూ రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. కట్టె కాలే వరకూ పార్టీని వదలనని శపథం చేసిన పాలకొండ్రాయుడు ఇచ్చిన మాట ప్రకారం తుదిశ్వాస విడిచేవరకూ పార్టీ కోసమే పనిచేశారు. తాజా రాజకీయ పరిణామాలతో సుగవాసి కుటుంబానికి తెలుగుదేశం పార్టీలో అధిష్టానం తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో నమ్ముకున్న అభిమానుల కోసం పార్టీ వీడుతున్నట్లు ప్రకటించారు. 2024 ఎన్నికలలో నారా చంద్రబాబునాయుడు సుగవాసి బాలసుబ్రమణ్యంను మొదటగా రాజంపేట ఎంపీ అభ్యర్థిగా ప్రకటించి అనంతరం కూటమి పొత్తుల్లో భాగంగా రాయచోటి నియోజకవర్గంలో కాకుండా రాజంపేట అసెంబ్లీ అభ్యర్థిగా ప్రకటించారు. అది కూడా కేవలం ఎన్నికలకు కొన్ని రోజులు ముందే అభ్యర్థిగా ప్రకటించినప్పటికీ అధిష్టానం నిర్ణయాన్ని శిరోధార్యంగా భావించి బాలసుబ్రమణ్యం ఎన్నికల బరిలో దిగారు. స్థానికేతరుడు కావడం, స్వల్ప సమయంలో నియోజకవర్గంలోని ముఖ్య నాయకులను, కార్యకర్తలను కలుపుకొని పోవడంలో సమయాభావం వలన స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. ఓటమిపాలైనప్పటికీ రాజంపేట నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలైన అన్నమయ్య డ్యాం పునర్నిర్మాణం, రాజంపేట జిల్లా కేంద్రం, వైద్య కళాశాల వంటి తదితర ప్రధాన సమస్యలపై ఎప్పటికప్పుడు అధిష్టానం దృష్టికి తీసుకెళ్తూ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడేందుకు కృషి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాలకొండ్రాయుడి కుటుంబానికి తగినంత ప్రాధాన్యత ఇవ్వలేదనే సుబ్రహ్మణ్యం అసంతృప్తిగా ఉన్నారు. రాయచోటి పర్యటనలో సైతం ప్రాధాన్యత ఇవ్వకపోవడం, ఇన్‌ఛార్జి వ్యవహారంలోనూ మొండిచేయి చూపడంతో పాటు ఇటీవల స్వర్గస్తులైన పాలకొండ్రాయుడికి చంద్రబాబు నివాళి అర్పించకపోవడం, కుటుంబాన్ని పరామర్శించకపోవడం, కడప నగరంలో జరిగిన మూడు రోజులు మహానాడులో సైతం పాలకొండ్రాయుడి ప్రస్తావన కూడా తేకపోవడం వంటి తదితర కారణాలతోనూ.. తరచూ అవమానాలకు గురవుతున్నా పార్టీలోనే కొనసాగుతూ వచ్చిన పాలకొండరాయుడు కుటుంబం ప్రాధాన్యత ఇవ్వని పార్టీలో కొనసాగడం కంటే రాజీనామా చేయడమే ఉత్తమమని అభిమానుల సూచనల మేరకు బాలసుబ్రమణ్యం సోదరులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. చంద్రబాబుతో సమకాలీన రాజకీయాలు చేసిన పాలకొండ్రాయుడు ఆరోగ్యం సహకరించకపోయినా గడిచిన ఎన్నికల్లో మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి గెలుపు కోసం వీల్ చైర్‌లోనే ప్రచారం చేశారని, తెలుగుదేశం పార్టీకి ఇంత విధేయులుగా ఉన్న వీరి కుటుంబాన్ని చంద్రబాబు నాయుడు నిర్లక్ష్యం చేయడం వల్లనే వారు పార్టీ వీడినట్లు వారి అభిమానులు చర్చించుకుంటున్నారు.



ట్రోపీ అందుకుంటున్న అనంతపురం జట్టు

సౌత్ జోన్ వన్డే క్రికెట్ టోర్నీ విజేత అనంతపురం

- నాల్గో స్థానంలో కడప జట్టు

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 1 నుండి 7 వరకు కడపలోని వైఎస్ రాజారెడ్డిఎసిఎ స్టేడియం, కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానాలలో లీగ్ పద్ధతిలో నిర్వహించిన ఎసిఎ సౌత్ జోన్ అండర్-23 వన్డే క్రికెట్ టోర్నమెంట్ విజేతగా అనంతపురం జట్టు నిలిచింది. రెండవ స్థానంలో నెల్లూరు జట్టు, మూడవ స్థానంలో చిత్తూరు జట్టు నిలిచాయి. నాలుగవ స్థానంలో కడప జట్టు నిలువగా చివరి స్థానంలో కర్నూలు జట్టు నిలిచింది. లీగ్ పద్ధతిలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో సౌత్ జోన్‌కు చెందిన కడప, కర్నూలు, చిత్తూరు, నెల్లూరు, అనంతపురం జట్లు పాల్గొన్నాయి. అనంతపురం జట్టు మొత్తం నాలుగు మ్యాచ్‌లు ఆడి అందులో మూడు మ్యాచ్‌లు గెలిచి 1.768 నెట్ రన్ రేట్ సాధించి మొదటి స్థానంలో నిలిచి టోర్నమెంట్ ఛాంపియన్‌గా నిలిచింది. నెల్లూరు జట్టు నాలుగు మ్యాచ్‌లు ఆడి అందులో మూడు మ్యాచ్‌లలో విజయం సాధించి 1.105 నెట్ రన్ రేట్ సాధించి రెండవ స్థానంలో నిలిచింది. చిత్తూరు జట్టు నాలుగు మ్యాచ్‌లు ఆడి అందులో మూడు మ్యాచ్‌లు గెలిచి 0.610 నెట్ రన్ రేట్ సాధించి మూడవ స్థానంలో నిలిచింది. కడప జట్టు నాలుగు మ్యాచ్‌లు ఆడి అందులో ఒక మ్యాచ్ గెలిచి - 0.669 నెట్ రన్ రేట్‌తో నాల్గవ స్థానంలో నిలిచింది. కర్నూలు జట్టు నాలుగు మ్యాచ్‌లు ఆడి అందులో ఏ ఒక్క మ్యాచ్ కూడా గెలువకపోవడంతో -2.705 నెట్ రన్ రేట్‌తో చివరి స్థానంలో నిలిచింది.

నిద్రమత్తులో జిల్లా విద్యాశాఖ అధికారులు : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లా వ్యాప్తంగా చదువు పేరుతో వేల ,లక్షల,కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్న విద్యాసంస్థలపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా విద్యాశాఖ అధికారులు నిద్రమత్తులో ఉన్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరబాబు రవి విమర్శించారు. శనివారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువునే వ్యాపారంగా మార్చుకున్న జిల్లాలోని ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు విపరీతంగా పెరిగిపోయాయని తెలిపారు. కడప నగరం, బద్వేలు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, మైదుకూరు, పోరుమామిళ్ల ప్రాంతాలలో పుట్టగొడుగులు లాగా విద్యాసంస్థలు స్థాపించి విద్యార్థులను, తల్లిదండ్రులను అధిక ఫీజులతో, పుస్తకాల పేరుతో లక్షల, కోట్ల రూపాయలు దందా చేస్తున్న కూడా ఏమి పట్టనట్టుగా నిద్రమత్తులో వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఎస్ఎఫ్ఐగా ఆందోళనలు చేస్తున్నా అన్ని వార్తాపత్రికల్లో అరాచకాల పైన వస్తున్నా ఏమీ తెలియనట్టుగా ఉంటున్నారని విమర్శించారు.

అయోమయం

ప్రజాదృష్టి

ఉపాధ్యాయ బదిలీల్లో అయోమయం నెలకొంది. రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ ఇష్టానుసారంగా వ్యవరిస్తుండడమే కారణమని తెలుస్తోంది. జిల్లాలో సుమారు 6,500 మంది ఉపాధ్యాయులను బదిలీలు చేయాల్సి ఉంది. వీరందరూ ఐదేళ్లు, ఎనిమిదేళ్లు సర్వీసు పూర్తి చేసి ఉన్నారు. చైతన్యవంతులను ఉపాధ్యాయ లోకాన్ని బదిలీలు చేయడమంటే కత్తిమీద సామును తలపించడమే అవుతుంది. జిల్లా వ్యాప్తంగా వేలాది మంది ఉపాధ్యాయులు ఉండడం, చైతన్యం పాలు ఎక్కువగా ఉండడం తెలిసిందే. పలు ఉపాధ్యాయ సంఘాలు సైతం క్రియాశీలంగా వ్యవహరిస్తుండడంవంటి కారణాల రీత్యా ఉపాధ్యాయుల బదిలీలు చేయడం సవాలుతో కూడుకున్న వ్యవహారంగా పేర్కొనవచ్చు. ఉపాధ్యాయుల బదిలీలపై పాఠశాల విద్యా శాఖ తీవ్రంగా కసరత్తు చేయాలి. ప్రస్తుత బదిలీలను పరిశీలిస్తే సీరియస్‌గా కసరత్తు చేసిన దాఖలాలు కనిపించడం లేదనే వాదన వినిపిస్తోంది. ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో ఎంపిక చేసుకున్న ఆప్షన్ల ప్రకారం బదిలీలు ఉండకపోవడం విమర్శలకు ఆస్కారాన్ని కలిగిస్తోంది. ఎంపిక చేసుకున్న ఆప్షన్లను కాదని ఇతర ప్రాంతాలకు బదిలీలు చేయడం ఏమిటని, మరి అలాంటప్పుడు ఆప్షన్లు ఇవ్వడంలో అర్థమేమిటనే ప్రశ్న వినిపిస్తోంది. కొందరి ఆప్షన్లు రిజర్వ్‌లో ఉంచడంలో దాగి ఉన్న పరమార్థమేమిటో తెలియడం లేదనే వాదన ఉపాధ్యాయ సంఘాల నుంచి వినిపిస్తుండడం గమనార్హం. స్పౌజ్ బదిలీల్లోనూ గందరగోళం నెలకొంది. భార్యాభర్తలు సమీప పాఠశాలలు, ఒకే పాఠశాలల్లో పనిచేయడానికి ఉద్దేశించిన స్పౌజ్ ఉద్యోగులను ఇతర ప్రాంతాల్లోని పాఠశాలలకు బదిలీ చేయడం ఏమిటనే వాదన వినిపిస్తోంది. సర్ ప్లస్ ఉపాధ్యాయుల పరిస్థితి అయోమయంగా మారడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలోని సిపిడబ్ల్యు స్కీముల టెండర్ల ఓపెన్ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి కడప జిల్లాలోని 25 సిపిడబ్ల్యు స్కీముల టెండర్ల ఓపెన్ వ్యవహారంలో పారదర్శకత కొరవడింది. ఉదాహరణకు లక్కిరెడ్డిపల్లి, మాధవరం, కొత్తమాధవరం స్కీముల టెండర్ల వ్యవహారం గందరగోళాన్ని సృష్టించింది. లక్కిరెడ్డిపల్లి స్కీముటెండర్ ఓపెనింగ్, ఎఎస్‌డి చెల్లింపుల్లో రాజీపడడం విమర్శలకు ఆస్కారాన్ని కలిగించిందని చెప్పవచ్చు. సిపిడబ్ల్యు స్కీముల టెండర్లకు పోటీ పెరిగిన కారణంగా ఎక్కువ లెస్‌కు వేయడాన్ని నిరోధించాలనే ఉద్దేశంతో ఎఎస్‌డి నిబంధన అమలులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. అమలు చేయడంలో అయిన వారికి ఆకుల్లో..కానివారికి కంచాల్లో పెట్టడమనే సామెతను తలపిస్తోంది. ఆర్‌డబ్ల్యుఎస్‌కు చెందిన ఓ ఉన్నతాధికారి, కాంట్రాక్టర్లతో కుమ్మక్కు కావడానికి ఎఎస్‌డి నిబంధనను వాడుకోవడం జుగుప్సాకరమని గ్రహించాలి. కీలక సమస్యలపై కలెక్టర్, కమిషనర్ స్థాయి వంటి ఉన్నతాధికారులు సీరియస్‌గా దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్ప వచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కోరా షూ మేకర్స్ దుకాణం ప్రారంభం

ప్రజాశక్తి -కడప అర్బన్



దుకాణం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు

నగరంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న సరికొత్త ప్రిమియం బ్రాండెడ్ షూ షోరూమ్ శనివారం టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప ప్రజలకు మోడరన్, హై క్వాలిటీ ఫుట్వేర్ ఎంపికలు అందించేందుకు ఈ షోరూమ్ పెద్ద వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధి చెందాలంటే ఇలాంటి షోరూములు మరిన్ని రావాలని ఆకాంక్షించారు.మేనేజింగ్ డైరెక్టర్ కోరా చలపతి మాట్లాడుతూ నాణ్యమైన ఫుట్వేర్ను అందించడమే లక్ష్యంగా కడపలో కోరా షో రూమ్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఇక్కడ అన్ని రకాల ఫుట్వేర్స్ లభిస్తాయని పేర్కొన్నారు. సరసమైన ధరలకే ప్రజలకు అందుబాటులో తెచ్చామని, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సందర్భంగా ఆయన కోరారు. కార్యక్రమంలో కంపెని ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

- డిటిసి కార్యాలయం ఆకస్మిక తనిఖీలో రవాణా శాఖ మంత్రి మండిపల్లి

ప్రజాశక్తి-కడప

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కడప పట్టణంలోని ఉప రవాణా కమిషనర్ కార్యాలయాన్ని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణా శాఖ అధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేసి రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకు ప్రజలకు ట్రాఫిక్ రూల్స్ గురించి పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ప్రాణం ఎంతో విలువైనదని, రోడ్డు ప్రమాదాల మూలంగా ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు లేకుండా జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రోడ్డు భద్రత కమిటీలోని ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో పని చేసి ప్రమాదాలను పూర్తిగా అరికట్టా లన్నారు. ఈ సందర్భంగా మంత్రి కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం కార్యాలయపు సిబ్బందితో మాట్లాడి మీకు ఎలాంటి సమస్యలున్న వెంటనే తమకు తెలియజేసి పరిష్కరించుకోవచ్చు అని వారికి తెలిపారు.



ప్రొద్దుటూరులో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

ఆడబిడ్డ ఇంటికి వరం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఆడబిడ్డ ఇంటికి భారం కానే కాదని.. ఇంటికి వరమని డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ బద్వేల్ శివప్రసాద్‌రెడ్డి అన్నారు. సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ నుండి పిసిపిఎన్‌డిటి చట్టం 1994పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ కూతురు అంటే భారం కాదని కుటుంబానికి దేవుడు ఇచ్చిన వరం అన్నారు. ఎవరైనా ఇద్దరు పిల్లలు వైద్యుని ఒక్కటేనని పేర్కొన్నారు. గర్భస్రావం తల్లి ప్రాణానికి హానికరమన్నారు. లింగ వివక్షతో గర్భస్రావానికి పాల్పడరాదన్నారు. అలా చేస్తే చట్ట ప్రకారం నేరమన్నారు. చట్టాన్ని అతిక్రమించి లింగ నిర్ధారణ పరీక్షలు చేసినవారికి, చేయించిన వారికి, అందుకు సహకరించిన వారికి మూడు నుంచి ఐదు సంవత్సరాల వరకు జైలు శిక్షతోపాటు రూ.50 వేలకుపైగా జరిమానా విధిస్తారని వివరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు సుబ్బారెడ్డి, సభ్యులు చెన్నమ్మ, గంగాభవాని, రమణమ్మ, నరసింహారెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు, స్థానికులు పాల్గొన్నారు.

ఎపి పోర్టల్ సేవలు నిలుపుదల

- మున్సిపల్ కమిషనర్ డి.రాముడు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

నాలుగు రోజులపాటు ఎపి పోర్టల్ సేవలు నిలుపుదల అవుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ డి.రాముడు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ/వార్డు సచివాలయ శాఖ నిర్వహిస్తున్న ఎపి సేవ పోర్టల్‌ను మైక్రోసాఫ్ట్ నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డేటా సెంటర్‌కు తరలింపు (మైగ్రేషన్) చేయడం వలన ఈ పనుల నిర్వహణ నిమిత్తం శనివారం ఉదయం నుండి మంగళవారం రాత్రి వరకు ఎపి సేవ పోర్టల్ ద్వారా అందించు సేవలను నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. ఆదాయ ధ్రువీకరణ పత్రం, సమగ్ర ధ్రువీకరణ పత్రం, భూమి మ్యుటేషన్లు, రేషన్/రైస్ కార్డులు, ఇల్లు స్థల పట్టాలు, పుట్టుక, వివాహ ధ్రువీకరణ పత్రాలు, రెవెన్యూ వాటర్ ట్యాప్, పట్టణ పరిపాలన సంబంధిత సేవలు, మత్స్యశాఖ సేవలు అందుబాటులో ఉండవని తెలిపారు. ఇతర ప్రభుత్వ సేవలు మీసేవా కేంద్రాలలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఇందుకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ వైద్యులు సమక్షంలో 75ఏళ్ళ పైబడిన వారికి మున్సిపల్ కార్యాలయంలో 8న ఆదివారం ఉదయం 7 గంటలకు యోగా గురువులచే ఉచిత శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు యోగా శిక్షణ కార్యక్రమంలో పాల్గొనాలని కమిషనర్ కోరారు.

చిత్తశుద్ధి ఉంటే ప్రాజెక్టులను పూర్తి చేయాలి

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పెండింగ్‌లో ఉన్న వెలిగొండ, గాలేరు-నగరి, హంద్రీ నీవా, తెలుగుగంగ, అన్నమయ్య ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అమ్మకు అన్నం పెట్టని ప్రబుద్ధుడు పిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తా అన్నట్లుంది సాగునీటి ప్రాజెక్టుల విషయంలో టిడిపి కూటమి ప్రభుత్వం వైఖరి అన్నారు. శ్రీశైలం ప్లంజ్‌పూల్ మరమ్మతులకు రూ.300 కోట్లు విడుదల చేయని కారణంగా శ్రీశైలం డ్యాం ప్రమాదపు అంచుల్లో ఉందన్నారు. రెండేళ్లల్లో రూ.15 వేల కోట్లు ఖర్చు పెడితే పెండింగ్‌లో ఉన్న వెలిగొండ, తెలుగుగంగ, గాలేరు-నగరి, హంద్రీ-నీవా, అన్నమయ్య, ఫించా, ఝురికోన ప్రాజెక్టులన్నీ పూర్తయి రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందని వివరించారు. నిధులు లేని కారణంగా వీటిలో కొన్ని ఎక్కడ చేసిన గొంగళి అక్కడే అన్న చందంగా, మరికొన్ని నత్తకు నడకన జరుగుతూ ఉన్నాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో రూ.81,900 కోట్లతో పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు కోసం టెండర్లు పిలవాలని చంద్రబాబు ప్రభుత్వం తహతహ లాడడం విడ్డూరంగా ఉందన్నారు. కమీషన్ల కక్కుర్తి కోసమే ప్రాజెక్టులు నిర్మించాలని ప్రయత్నాలు జరుగుతున్నట్లు చెప్పారు. పోలవరం-బనకచర్ల మరో కాళేశ్వరం అవుతుందన్నారు.

ప్రజల జీవితాలతో చెలగాటం

- పులివెందుల కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ధృవకుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రజల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని పులివెందుల కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఎం.ధృవకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎడాది అవుతున్నా హామీలను నేర వేర్చకుండా ఎప్పుడూ ఇతర పార్టీలపై దుష్ప్రచారం చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని విమర్శించారు. రెండు పార్టీలూ ఒకరిపై ఒకరు మాటల యుద్ధం చేయడం తప్ప, ప్రజల బాధలు మాత్రం వారికి కనిపించడం లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేయడం శోచనీయమన్నారు. కాంగ్రెసు పార్టీతోనే ప్రజలకు నిజమైన పాలన లభిస్తుందని తెలిపారు. మాటలు చెప్పే నాయకత్వం కాకుండా పని చేసి చూపించే నాయకత్వాన్ని ప్రజలు బలపరచాలని ఆయన కోరారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్



బక్రీద్ పండగ సందర్భంగా శిల్పారామంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా శ్రీలక్ష్మీ నరసింహస్వామి చెన్నూరు థమ్ బిర్యాని వారి సహకారంతో శనివారం సాయంత్రం పులివెందుల యువరాజా డాన్సింగ్ స్కూల్ చిన్నారులచే శాస్త్రీయ, జానపద, సినీ నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. శిల్పారామం పరిపాలన అధికారి విశ్వనాథ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కల్వర్టు వద్ద దెబ్బతిన్న రోడ్డు

- ఇబ్బందుల్లో రాజువారిపేట ప్రజలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని రాజువారిపేట గ్రామ సమీపంలో కల్వర్టు వద్ద దెబ్బతిన్న రోడ్డుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు పక్కనే పెద్ద గుంత ఏర్పడడంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలో ప్రయాణించేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. గత వారంలో ఈ గుంతలో పడి ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న యువకుడు గాయాల పాలయ్యాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతకు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. రాత్రి సమయాల్లో ప్రయాణికులు గుంతలో పడి ప్రమాదాలకు గురి కాకుండా చూడాలని పలువురు సూచిస్తున్నారు.


ప్రమాదకరంగా ఉన్న గుంత

పచ్చిరొట్ట సాగు.. భూసారం బహుబాగు

ప్రజాశక్తి - ఖాజీపేట

వ్యవసాయంలో రసాయనిక ఎరువుల వాడకం పెరిగి, సేంద్రియ ఎరువుల వాడకం తగ్గింది. పంట త్వరగా రావాలన్న ఉద్దేశంతో రైతులు ఎక్కువగా రసాయనిక ఎరువులు, పురుగుమందులు వినియోగించడం ఎక్కువైంది. తద్వారా భూసారం తగ్గడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియపై దృష్టి సారిస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు సేద్యపు పనుల్లో నిమగ్న మవుతున్నారు. ప్రభుత్వం 50శాతం రాయితీతో జీలగ విత్తనాలు అందిస్తోంది. నీటి లభ్యత ఉన్న ప్రాంతాలలో పచ్చిరొట్ల సాగును విస్తరంగా సాగు చేశారు. మరికొన్ని ప్రాంతాలలో నారుదొడ్లను సిద్ధం చేసుకుంటున్నారు. పచ్చిరొట్ట సాగు వల్ల భూసారం పెరగడంతోపాటు ఆర్థిక భారం తగ్గుతుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. పచ్చిరొట్ట సాగు వల్ల భూమిలో కార్బన్, నత్రజని శాతం పెరుగుతుందని, పంటలకు తెగుళ్ల బెడద తక్కువగా ఉంటుందని సూచిస్తునన్నారు. పైరు ఏపుగా పెరగడంతోపాటు పంట ఉత్పత్తులు నాణ్యమైనవిగా ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే కుంది, పెన్నా నది పరివాహక ప్రాంతాలలో వ్యవసాయ మోటర్లు అందుబాటులో ఉన్న రైతులు పచ్చిరొట్టను విస్తారంగా సాగు చేశారు. చెన్నూరు మండలంలో కొండపేట, రాచిన్నాయపల్లె, రామనపల్లె ప్రాంతాలలో రైతులు పచ్చిరొట్టను విస్తారంగా సాగు చేశారు. ఈ ప్రాంత రైతులకు పెన్నా నది అందుబాటులో ఉండడంతో వర్షాలపై ఆధారపడకుండా ముందస్తుగా పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. పెన్నా నది పరివాహక ప్రాంతాలైన కొమ్మలూరు, త్రిపురవరం, మిడుతూరు, సన్నపల్లె ప్రాంతాలలో పచ్చిరొట్ట సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. మండల వ్యాప్తంగా దాదాపు పదివేల ఎకరాలలో ఖరీఫ్‌లో వరి పంటను సాగు చేస్తుంటారు.


సాగులో ఉన్న జీలుగ పంట

ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు


వేంపల్లెలో ప్రార్థనలకు హాజరైన ముస్లింలు

ప్రజాశక్తి - వేంపల్లె

త్యాగానికి ప్రతీక బక్రీద్ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మదీనాపురం, బిస్మిల్లా మసీదు, ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముందుగా బక్రీద్ విశిష్టతను మత గురువులు వివరించారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సిఐ నర్సింహులు, ఎస్ఐ రంగారావు ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ఠ భద్రత ఏర్పాటు చేశారు. త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండగ అందరి ఇళ్లలో సంతోషాలు నింపాలని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, జడ్పీటీసీ రవికుమార్ రెడ్డి ఆకాంక్షించారు. ముస్లింలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ముద్దనూరు : త్యాగానికి ప్రతీకైన బక్రీద్ పర్వదినం సందర్భంగా శనివారం ముస్లింలు మండలంలోని అన్ని ఈద్గాల వద్ద భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బక్రీద్ ప్రాముఖ్యతను మత గురువులు వివరించారు. ముద్దనూరు, ఉప్పులూరు, కోనాపురం, యామవరం, మంగపట్నం ఈద్గాల వద్ద ముస్లింలు నమాజ్ ఆచరించారు. మత పెద్దలు పాల్గొన్నారు.

కడప అర్బన్ : బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కడప బిల్డప్ సర్కిల్ వద్ద ఉన్న ఈద్గాలో బక్రీద్ నిర్వహించిన నమాజ్‌లో పెద్ద దర్గా పీఠాధిపతి ఆరిఫుల్లా హుసేని, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఎస్. అమీర్ బాబు ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు నిర్వహించారు. బక్రీద్ పర్వదినం శాంతి, ఆనందం, ఐక్యతకు ప్రతీకగా నిలవాలని వారు ఆకాంక్షించారు.

- నగరంలోని దండు లో వెలసి ఉన్న చారిత్రాత్మకమైన మురాదియ షాహి ఈద్గా లో ఈద్-ఉల్-జుహ ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మురాదియ షాహి ఈద్గా వారసుడు ముతవల్లి సయ్యద్ షా మొహమ్మద్ జమాలుల్లా బాష సాహెబ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బక్రీద్ పండుగ గురించి పలు ఆధ్యాత్మిక సందేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో ముతమల్లి సోదరుడు సయ్యద్ షా మొహమ్మద్ అకమల్ పీరా మురాది, రాజకీయ నాయకులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

- నగరంలోని రామాంజనేయపురం, సాగర్ కాలనీ లో ఉన్న మజ్జిదే కుబా లో ఈద్-ఉల్-జుహ ప్రార్థనలు నిర్వహించారు. మత గురువు మౌలానా అబ్దుల్ కబీర్ ఉమ్రి పండుగ గురించి పలు సందేశాలు ఇచ్చారు. మహిళల ప్రార్థనల కోసం ప్రత్యేక పరదా ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

- రవీంద్రనగర్ లో ఉన్న మజ్జిదే బుఖారియ లో ఘనంగా ఈద్-ఉల్- జుహ ప్రార్థనలు నిర్వహించారు. ప్రభుత్వ ఖాజీ, మస్జిద్ ఇమామ్ ఓ ఖతిబ్ సయ్యద్ సిరాజుద్దీన్ బుఖారి పండగ విశిష్టత గురించి ఆధ్యాత్మిక సందేశాలు ఇచ్చారు.
కార్యక్రమంలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ఖాజీపేట : బక్రీద్ పండుగను శనివారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు.ఆయా ఈద్గాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఒకరినొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అగ్రహారం, టీచర్స్ కాలనీ, మండలంలోని దుంపలగట్టులో ఉన్న ఈద్గాలలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువులు మహమ్మద్ ప్రవక్త సందేశాన్ని చదివి వినిపించారు.

చాపాడు : ఈదుల్ జూహాను (బక్రీద్) మండల పరిధిలోని ఈద్గా ప్రాంగణాల్లో ముస్లింలు శనివారం ఆనందోత్సాహాలతో ఘనంగా ఆచరించారు. బక్రీద్ పండుగ ప్రాముఖ్యతను మత పెద్దలు వివరించారు. మసీదులు, ఈద్గాలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సత్యం, న్యాయం, ధర్మం, త్యాగం, సహనం, పరోపకారం, బాధ్యతాభావం అలవరచుకోవాలని మత పెద్దలు సూచించారు. ఎల్లప్పుడూ మత సామరస్యం వెల్లివిరియాలని ఆశించారు. చాపాడుతోపాటు అల్లాడుపల్లె, మడూరు, వెదురూరు, రాజుపాలెం, తిమ్మాయపల్లె ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పులివెందుల టౌన్ : భక్తిశ్రద్ధలతో ముస్లింలు బక్రీదు పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని శ్రీరామ థియేటర్ వద్ద, పార్నపల్లి రోడ్డు వద్ద ఉన్న ఈద్గాలలో శనివారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రూరల్ సిఐ వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.


పులివెందులలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

తేక్వాండో బ్లాక్‌బెల్ట్ సాధించిన ఎస్‌వి విద్యార్థులు



బ్లాక్ బెల్ట్ సాధించిన ఎస్‌వి తేక్వాండో అకాడమీ విద్యార్థులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మూడేళ్లుగా గీతాశ్రమంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ స్వయం ప్రతిపత్తి కళాశాలలో శిక్షణ తీసుకుంటున్న ఎస్‌వి తేక్వాండో అకాడమీ విద్యార్థులు శనివారం శ్రీ వెంకటేశ్వర డిగ్రీ అటానమస్ కాలేజిలో జరిగిన బ్లాక్ బెల్ట్ టెస్ట్‌లో ఎస్‌వి తెక్వాండో అకాడమీకి సంబంధించిన 10 మంది విద్యార్థులు బ్లాక్ బెల్ట్ సాధించారని ప్రోగ్రామ్ చీఫ్ ఎగ్జామినర్‌గా కర్ణాటక రాష్ట్రనికి చెందిన గ్రాండ్ మాస్టర్ వి.నారాయణ స్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రొద్దుటూరులో ఇలా బ్లాక్ బెల్ట్ టెస్ట్ జరగడం ఇదే మొదటి సారి అన్నారు. స్టూడెంట్స్ ఇంకా ఉన్నత స్థాయికెదగాలని ఆయన ఆకాంక్షించారు. ముఖ్యఅతిథిగా శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల డైరెక్టర్ అరకటవేముల పృథ్వీ నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు చదువు మాత్రమే కాకుండా క్రీడలపై ఏకాగ్రత పెట్టాలన్నారు. ఎస్‌వి తెక్వాండో అకాడమీకి శ్రీవెంకటేశ్వర డిగ్రీ స్వయం ప్రతిపత్తి కళాశాల నుండి ఎలాంటి సాయం కావాలన్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌వి తెక్వాండో అకాడమీ స్థాపకులు గ్రాండ్ మాస్టర్ అలిశెట్టి శ్రీనివాసులు, చిత్తూరు జిల్లా తిరుపతికి చెందిన గ్రాండ్ మాస్టర్ నారాయణ మూర్తి, శ్రీవెంకటేశ్వర డిగ్రీ స్వయం ప్రతిపతి కళాశాల కో-ఆర్డినేటర్ పర్లపాడు గౌరీ శంకర్, కల్లూరు రుద్రసేన రెడ్డి, బెంహర్ వర ప్రసాద్, సునీల్, అఖిల్, బాలాజీ పాల్గొన్నారు.

మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ఉపాధ్యాయుల బదిలీలు వెబ్ ద్వారా కాకుండా మ్యానువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల పిలుపు మేరకు శనివారం స్థానిక పులివెందుల మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో నిరసన వ్యక్తం చేశారు. అధికారులు నిర్వహించతలపెట్టిన వెబ్ కౌన్సెలింగ్ హెల్ప్‌లైన్ సెంటర్ వద్ద ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పులివెందుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. వెబ్ కౌన్సెలింగ్‌లో ఉపాధ్యాయులు ఎక్కువ ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి వస్తుందని, ఇందులో నష్టపోయే అవకాశం ఉందన్నారు. కచ్చితంగా ముందుగా ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలకు మాట ఇచ్చిన విధంగా మాన్యువల్ కౌన్సెలింగ్ చేపట్టాలని విద్యాశాఖ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఆ మేరకు ప్రభుత్వం స్పందించకపోతే ఆదివారం ఉదయం డిఇఒ కార్యాలయాల ముట్టడి కార్యక్రమం చేపడుతామని హెచ్చరించారు. పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


ఎంఇఒకు వినతిపత్రమిస్తున్న ఉపాధ్యాయులు

మోడల్ ప్రైమరీ స్కూల్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సింహాద్రిపురంలో ఏర్పాటు చేస్తున్న మోడల్ ప్రైమరీ స్కూల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ జెడ్పిటిసి సభ్యుడు పోరెడ్డి ప్రభా కర్‌రెడ్డి సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నూతన విద్యావి ధానంలో భాగంగా ప్రాథమిక విద్య బలోపేతానికి విద్యాశాఖ మంత్రి లోకేష్ ఒక సంస్కరణ తెచ్చారన్నారు. ఈ విధానం ప్రస్తుత విద్యా సంవత్సరం నుండి అమలు చేస్తున్నారన్నారు. సింగిల్ టీచర్, ఇద్దరు టీచర్లు ప్రాథమిక విద్య స్కూల్స్‌లో ఉండడం వల్ల ఆ విద్య ప్రభుత్వ బడులలో విఫలమవుతోందన్నారు. మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటు చేసి ఆ స్కూల్స్‌లో సబ్జక్ట్ టీచర్స్‌ను (ప్రతి తరగతికీ ఒక టీచర్ తప్పనిసరిగా ఏర్పాటు) ఇస్తూ ఒక హెడ్ మాస్టారు పోస్ట్ కూడా ఇచ్చేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఇందులో భాగంగా సింహాద్రిపురానికి ఒక మోడల్ ప్రైమరీ స్కూల్ మంజూరైందన్నారు. ఈ పాఠశాలను అకడమీక్ సైడ్ మాత్రమే మోడల్‌గా కాకుండా మౌలిక వసతులపరంగా కూడా ఒక ఆదర్శ పాఠశాలగా రూపొందిస్తున్నామన్నారు. సింహాద్రిపురంలో ప్రాథమిక విద్యను అభ్యసిస్తున్న పిల్లల తల్లిదండ్రులు గమనించాలన్నారు. తమ పిల్లల్ని ఇందులో చేర్పించాలన్నారు. ప్రయివేటు స్కూల్స్ మోజులో పడి అప్పులు చేసుకోవద్దని తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి చేద్దామని ఆయన పిలుపునిచ్చారు.


పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి


స్టేట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ఇంటర్ ఫలితాల్లో 'శ్రీవిద్య'కు రాష్ట్ర స్థాయి ర్యాంకులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇంప్రూవ్మెంట్ ఫలితాల్లో ఎంపిసి, బైపిసి గ్రూపుల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకులు సాధించారని ప్రిన్సిపల్ కె.ఒ.వి.రమణారావు తెలిపారు. జూనియర్ ఎంపిసి విభాగంలో కేటి గణేష్ 467 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించారన్నారు. సీఎం చందన 466 మార్కులతో స్టేట్ సెకండ్ ర్యాంకు సాధించారన్నారు. శ్రీరంగ హర్షవర్ధన్, ఎస్ సుమయ సుల్తానా, ఎం.పూజిత, ఎం.పుష్పలత, ఎస్.రుక్సానా, ఎన్.కృష్ణతేజ, ఎస్.హదిల్, టీ.తేజస్విని, ఈశ్వర్ 466 మార్కులతో స్టేట్ థర్డ్ ర్యాంకు సాధిం చారన్నారు. జూనియర్ బైపిసిలో ఎస్.తౌషిఫ్ సుల్తానా, ఎస్.పవన్ కు మార్ 435 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించారని, ఎస్ అంజుమ్, కె.వి. సోమేశ్వరి, ఎల్.మహిత 433 మార్కులతో స్టేట్ థర్డ్ ర్యాంకు సాధించాలని తెలి పారు. ఇంతటి ఘనవిజయాన్ని సాధించిన విద్యార్థులను, తల్లిదండ్రులను కళా శాల డైరెక్టర్లు ఎస్.శ్రీకాంత్‌కుమార్‌రెడ్డి, ఎం.రామమోహన్, దస్తగిరి అభినం దించారు.

తపస్యా కళాశాల విజయకేతనం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

స్థానిక తపస్యా జూనియర్ కళాశాల ఇంటర్ రెండవ సంవత్సరం ఫలితాల్లో వి.జ్యోత్స్న 983 మార్కులు, మొదటి సంవత్సరం ఫలితాలలో ఉత్రిక్ష 465 మార్కులు సాధించి పట్టణంలో ప్రథమ స్థానాన్ని ఎగరవేశాలని కళాశాల కరస్పాండెంట్ చంద్రప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం విడుదల చేసిన ఇంటర్ ఫలితాలలో మంచి ప్రతిభ సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ రవిశంకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సుదర్శన్ రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

స్వామి వివేకానంద విద్యార్థులకు ప్రతిభ అవార్డు

ప్రజాశక్తి - వేంపల్లె


వినయ్, సుకీర్తిన

రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎంపిక చేసే ప్రతిభ అవార్డుకు తమ విద్యార్థులు ఎంపి కైనట్లు స్వామి వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించిన తమ పాఠశాల విద్యార్థులకు షేనింగ్ స్టార్ పేరుతో వినయ్, సుకీర్తిన అనే విద్యార్థులను ప్రభుత్వం ఎంపిక చేసినట్లు చెప్పారు. వీరికి సోమవారం ప్రము ఖులచే రూ.20 వేలు నగదు, ప్రశంసాపత్రాన్ని అందజేస్తారని పేర్కొ న్నారు. తమ పాఠశాల విద్యార్థులకు అవార్డులు రావడం సంతోషంగా ఉందని రామాం జనేయరెడ్డి తెలిపారు.

చాపాడులో ఐదుగురు ఎంపిక

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని మూడు పాఠశాలల నుంచి ఐదుగురు విద్యార్థులు ప్రతిభా అవార్డులకు ఎంపికయ్యారని ఎంఇఒ రవిశంకర్ తెలిపారు. ఈ ఏడాది 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో 500కుపైగా మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వం ప్రతిభా అవార్డులు అందజేస్తుందని తెలిపారు. ఈనెల 9న కడపలో ప్రభుత్వం వీరికి రూ.20వేలు ఆర్థికసాయం అందజేస్తుందన్నారు. గాయత్రి పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు, విజేత పాఠశాల నుంచి ఒకరు, చాపాడు హైస్కూల్ నుంచి ఒక విద్యార్థి ఎంపికైనట్లు ఆయన వివరించారు.


విజేతలకు షీల్డ్‌ను అందజేస్తున్న సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు

క్రీడలతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి - వేంపల్లె

క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని వేంపల్లి సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు పేర్కొన్నారు. పది రోజులుగా స్థానిక జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు శనివారంతో ముగిశాయి. చివరగా ఫైనల్లో నందిమండలం టీంతో వేంపల్లి టీంలు తల పడ్డాయి. నందిమండలం టీం విన్నర్‌గా.. వేంపల్లి టీం రన్నర్‌గా నిలిచాయి. విజేతలకు సర్పంచ్ బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి రూ.20వేలతోపాటు షీల్డ్ అందజేశారు. రెండవ బహుమతి రూ.15వేలు సర్పంచ్ ఆర్.శ్రీనువాసులు తన సొంత నిధులను అందజేశారు. బెస్ట్ బ్యాట్స్ మెన్‌గా పీటర్, బెస్ట్ బౌలర్‌గా యేసయ్య, బెస్ట్ ఫీల్డర్‌గా సాయికి కన్సోలేషన్ బహుమతులను అందజేసినట్లు క్రికెట్ ఆర్గనైజర్ భాస్కర్ తెలిపారు. కార్యక్ర మంలో వైసిపి జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి కాశిరెడ్డి ఆదినారాయణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్.వేణుగోపాల్, నాయకులు మదార్, రాహుల్, రవి పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణంలోని పార్నపల్లి రోడ్డులో ఉన్న కెనరా బ్యాంక్ దగ్గర మురుగు కాలువపై నిర్మించిన సిమెంట్ స్లాబ్ కుంగిపోయింది. ప్రమాదకరంగా ఉంది. ఆ ప్రాంతంలో బ్యాంకు, ఎల్ఐసి కార్యాలయం ఉండడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రజలు ఎక్కువగా తిరుగుతూ ఉంటారు. సిమెంట్ స్లాబ్ శిథిలావస్థకు చేరుకోవడంతో దెబ్బతిన ప్రమాదకరంగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి రెస్టారెంట్ సమీపం నుంచి పార్నపల్లె బస్టాండ్ వరకు మురుగు కాలువపై ఉన్న స్లాబు కొన్నిచోట్ల పూర్తిగా దెబ్బతింది. మరి కొన్నిచోట్ల శిథిలావస్థకు చేరుకుంది. దుకాణాల యజమానులు ప్రమాదాలు జరగకుండా స్లాబు పోయిన చోట బండలను వేసుకున్నారు. అధికారులు ఇదంతా చూస్తున్నా మరమ్మతులు చేపట్టలేదనే విమర్శలు ఉన్నాయి. వర్షాకాలంలో నీరు ప్రవహించిన నేపథ్యంలో ఫుట్‌పాత్‌పై ఉన్న సిమెంట్ పూర్తిస్థాయిలో దెబ్బతింటే ఏమైనా ప్రమాదాలు సంభవిస్తాయోమోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


కెనరా బ్యాంక్ సమీపంలో దెబ్బతిన్న మురుగు కాలువల స్లాబ్